ప్రజా గళమే
# స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
Praja Galame
సత్యానికి స్వరం
SPANDA
N.E.W.S.
APMUL/26/A3106
National Telugu Daily Newspaper




తల్లి బాటలో తనయ..







మంగళవారం || 13-10-2026 || సంపుటి: 1 || సంచిక: 69 || పేజీలు: 8 || వెల : రూ.5/-
Guntur, Vijayawada, Visakhapatnam, Prakasham, Nellore, Thirupathi, Hyderabad, Rangareddy, Medak, Karimnagar, Warangal


## ఫారం-6 మార్పులకు మేం ఆమోదం ఇవ్వలేదు!




- ఎన్నికల సంఘం వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- బీహార్ కేసు తీర్పు సమయంలో కొత్త ఫారం లేదన్న సీజేఐ
- ఫారంలో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలిస్తాం
- ఓటర్ల నమోదు ప్రక్రియ మార్పులపై కొనసాగుతున్న వివాదం

4

## సుప్రీంకోర్టుకు భారీ మార్చ్!

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ
- పిటిషన్ దాఖలు చేసినట్లు విపక్ష న్యాయ బృందం వెల్లడి

4



## సుప్రీం కోర్టును రాజకీయాల్లోకి లాగొద్దు!



- ప్రతిపక్ష నేతలకు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పష్టీకరణ

4

# కోటా మారితే.. కోటలు మారతాయా?!

### పురపోరులో అభ్యర్థుల లెక్కలను మార్చనున్న రిజర్వేషన్లు




- పురపోరులో అభ్యర్థుల లెక్కలను మార్చనున్న రిజర్వేషన్లు
- బీసీ ప్రాతినిధ్యంతో కూటమికి ప్రచార అవకాశం..
- టికెట్ల పంపకంలో ఐక్యతకు పరీక్ష
- స్థానిక అసంతృప్తిని అందిపుచ్చుకుంటే వైసీపీకి పునరాగమన వేదిక
- మహిళలకు అవకాశాలు.. పార్టీల్లో పాత ఆధిపత్యాలకు కొత్త సవాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల సమరానికి రిజర్వేషన్ల ప్రక్రియ కీలక మలుపు తిప్పుతోంది. రాష్ట్రంలోని 17 నగరపాలక సంస్థలు (కార్పొరేషన్లు), 106 పురపాలక సంఘాలకు (మున్సిపాలిటీలు) సంబంధించి మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాల రిజర్వేషన్లపై ప్రాథమిక కసరత్తు పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ మార్పులు కేవలం పోటీ చేసే అభ్యర్థుల పేర్లనే కాకుండా పార్టీల్లోని అంతర్గత ఆధిపత్యాలను, రాజకీయ సమీకరణాలను సమూలంగా మార్చే అవకాశం కనిపిస్తోంది.

**అమరావతి, స్పంద పొలిటికల్ బ్యూరో :** ఆశావహుడు ఒకరు.. రిజర్వేషన్ మరొకరికి! ఆంధ్రప్రదేశ్ పట్టణ రాజకీయాల్లో ఇప్పుడు మారబోయేది అభ్యర్థుల పేర్లే కాదు.. పార్టీల్లో అధికార సమీకరణాలు కూడా. మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులపై ఆశలు పెట్టుకున్న నాయకులకు రిజర్వేషన్ల కసరత్తు కొత్త పరీక్షగా మారుతోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు దక్కే అవకాశాలను రాజకీయ బలంగా మలుచుకునేందుకు అధికార కూటమి ప్రయత్నించే అవకాశం ఉండగా.. ఆ ఎంపికల్లో తలెత్తే అసంతృప్తిని తనకు అనుకూలంగా మార్చుకోవడం వైసీపీ ముందున్న మార్గం. రిజర్వేషన్‌తో పోటీ చేసే అవకాశం వస్తుంది.. ఆ అవకాశాన్ని విజయంగా మార్చేది అభ్యర్థి బలం, పార్టీ ఐక్యత, స్థానిక పాలనపై ప్రజల అభిప్రాయం. రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీలకు

మిగతా 2 లో



# తిరుపతి రూపురేఖలు మార్చే మహా ప్రణాళిక!

### రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం

- అలిపిరి వద్ద రూ.2,750 కోట్లతో యాత్రికుల టౌన్‌షిప్
- 2,700 గదులు.. రోజుకు 15 వేల మంది భక్తులకు వసతి
- రూ.242 కోట్లతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులు
- 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు నివాస లేఅవుట్లు

**అమరావతి, అక్టోబర్ 12 (స్పంద న్యూస్):** ప్రపంచ ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమల–తిరుపతిని అత్యాధునిక సౌకర్యాలతో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ అభివృద్ధి ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో రూ. 3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు సోమవారం అమరావతి సచివాలయం నుంచి దృశ్యమాధ్యమం ద్వారా శంకుస్థాపనలు చేశారు. భక్తులకు మెరుగైన వసతులు, రహదారుల విస్తరణ, టీటీడీ ఉద్యోగుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ

మిగతా 2 లో



## పెద్దశేష వాహనంపై శ్రీనివాసుడు

**తిరుమల, అక్టోబర్ 12 (స్పంద న్యూస్):** శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి వారు శ్రీ గోవిందరాజస్వామి అలంకారంలో ఏడుతలల స్వర్ణశేషవాహనంపై పెద్ద శేషవాహనం) తిరుమాడ వీధులలో భక్తులను అనుగ్రహించారు. ఆదిశేషుడు తన పడగ నీడలో స్వామివారిని సేవిస్తూ పాన్పుగా దాస్యభక్తిని చాటుతున్నాడు. ఆదిశేషుడు శ్రీహరికి మిక్కిలి సన్నిహితుడు. రామావతారంలో లక్ష్మణుడుగా, ద్వాపరంలో బలరాముడుగా శ్రీమన్నారాయణుడికి మిక్కిలి సన్నిహితంగా ఉన్నవాడు శేషుడు. ఈయన శ్రీభూదేవి సహితుడైన శ్రీవేంకటేశ్వరుని వహిస్తూ తొలిరోజు భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనాలపై స్వామివారు కనువిందు చేయనున్నారు.

## నలుగురు సజీవ దహనం!

- రెయిలింగ్‌ను ఢీకొట్టిన కారు.. క్షణాల్లో చెలరేగిన మంటలు
- మృతుల్లో చిన్నారి.. మరొకరి పరిస్థితి విషమం
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి నారా లోకేశ్

2

### విజయవాడ పశ్చిమ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం



## వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శ్రీశైలం జలాశయం

- దేశంలోనే తొలి ప్రాజెక్టుగా అరుదైన ఘనత!
- దక్షిణాసియాలోనే ప్రత్యేకమైన భారీ గేట్లు, నిర్మాణ పటిష్టతకు అంతర్జాతీయ గుర్తింపు
- 2009 భారీ వరదలను తట్టుకుని నిలిచిన వైనంపై ప్రశంసలు
- ఎమ్మెల్యే, అధికారులకు సర్టిఫికెట్లు అందజేత

3





## 11 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- ఆమ్రపాలికి పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బాధ్యతలు
- తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు
- మరో ఇద్దరికి అదనపు బాధ్యతలు

2

## బంగాళాఖాతంలో అల్పపీడనం

- దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన!
- అక్టోబర్ 14 నుంచి కోస్తాంధ్ర, తమిళనాడు తీరాల్లో విస్తారంగా వానలు
- రాయలసీమ, కేరళ, కర్ణాటకలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం
- ఈశాన్య రుతుపవనాల రాకకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు




దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రానున్న రోజుల్లో బలపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వాతావరణ వ్యవస్థ దక్షిణ బంగాళాఖాతం మీదుగా తమిళనాడు, శ్రీలంక తీరాల వైపు పయనిస్తుండటంతో దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వర్షాలు ఊపందుకోనున్నాయి.

3

## ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు



- విశాఖకు మహిళ, విజయవాడ అన్‌రిజర్వ్‌డ్
- 17 కార్పొరేషన్లకు మేయర్ రిజర్వేషన్లు ఖరారు
- పురపాలక శాఖ నుంచి జీవో నెం. 252 జారీ
- 5 బీసీ, 2 ఎస్సీ, 1 ఎస్టీ, 5 జనరల్ మహిళలకు కేటాయింపు
- విజయవాడ, తిరుపతి సహా 4 స్థానాలు అన్‌రిజర్వ్‌డ్

3

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం, 13 అక్టోబర్ 2026

# కోటా మారితే.. కోటలు మారతాయా?!

మొదటి పేజీ తరువాయి

సంబంధించి స్థానాలవారీ రిజర్వేషన్లపై ప్రాథమిక కసరత్తు జరిగినట్లు వార్తలు వెలువడుతున్నాయి. మంగళగిరి--తాడేపల్లి ఎస్టీలకు, కర్నూలు ఎస్సీ మహిళలకు, రాజమహేంద్రవరం ఎస్సీ జనరల్‌కు కేటాయించే అవకాశమున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అయితే తుది అధికారిక జాబితా అందుబాటులోకి వచ్చిన తర్వాతే నగరాలవారీ కేటాయింపులను నిర్ధారించాలి. కింది రాజకీయ విశ్లేషణ ఈ ప్రతిపాదనలు అమలైతే ఏర్పడగల పరిస్థితులపై ఆధారపడింది.

## బీసీ కోటా.. కూటమికి తొలి ప్రచార ఆయుధం

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించామనే అంశాన్ని కూటమి ప్రధాన ప్రచారంగా తీసుకెళ్లే అవకాశం ఉంది. కమిషన్ సిఫారసుల ఆధారంగా రిజర్వేషన్ల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం ద్వారా ఎన్నికలకు ఉన్న అడ్డంకులను తొలగించామనే వాదనకు ప్రభుత్వానికి అవకాశం లభిస్తోంది. పట్టణ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై జీవో 251 జారీ చేసినట్లు ఆంధ్రజ్యోతి నివేదించింది. మరోవైపు పార్టీ పరంగా బీసీలకు 34 శాతం స్థానాలు ఇస్తామన్న టీడీపీ ప్రకటనను ఏబీపీ కథనం ప్రస్తావించింది. అయితే ఈ ప్రచారానికి బలం చేకూర్చేది చివరకు విడుదలయ్యే అభ్యర్థుల జాబితానే. రిజర్వు స్థానాల్లో బీసీలకు అవకాశం ఇవ్వడంతోపాటు జనరల్ స్థానాల్లోనూ ఎంతమందిని నిలబెడతారన్నది కీలకం. అందులోనూ ఒకటి రెండు ప్రభావవంతమైన బీసీ వర్గాలకే అవకాశాలు పరిమితమైతే, మిగిలిన వర్గాల్లో అసంతృప్తి తలెత్తవచ్చు. 'ఎన్ని బీసీ సీట్లు?' అన్న ప్రశ్నతోపాటు 'ఏ బీసీ వర్గాలకు సీట్లు?' అన్న ప్రశ్న కూడా పురపోరును ప్రభావితం చేయనుంది.

## మూడు పార్టీల బలం.. ఒకే అభ్యర్థికి చేరుతుందా?

కూటమికి రిజర్వేషన్ల కంటే క్లిష్టమైన పరీక్ష సీట్ల సర్దుబాటు. ఒక మున్సిపాలిటీలో టీడీపీకి బలమైన నాయకత్వం ఉండొచ్చు. అదే



పట్టణంలో జనసేనకు ఆశావహులు, బీజేపీకి స్థానిక కార్యకర్తల బలం ఉండొచ్చు. రిజర్వేషన్ మారినప్పుడు అర్హత కలిగిన అభ్యర్థి ఏ పార్టీ నుంచి వస్తారన్నది కొత్త వివాదానికి దారితీయవచ్చు.కాకినాడ, మచిలీపట్నం బీసీ మహిళలకు కేటాయిస్తే.. ఆయా వర్గాల్లో ప్రజలతో సంబంధాలున్న మహిళను ఎంపిక చేయడంతోపాటు మూడు పార్టీల శ్రేణులను ఆమె వెనుక నిలబెట్టాల్సి ఉంటుంది. టికెట్ దక్కని నాయకుల కుటుంబాలు, అనుచరులు ఎంతవరకు సహకరిస్తారన్నది నిర్ణయాత్మకం. కూటమి గుర్తులన్నీ ఒకే వేదికపై కనిపించడం కంటే.. వాటి ఓట్లన్నీ ఒకే అభ్యర్థికి పడటం ముఖ్యం.

## వైసీపీకి అవకాశం.. రిజర్వేషన్ కంటే ఎంపికలోనే!

వైసీపీకి ఈ రిజర్వేషన్లు స్వయంగా రాజకీయ ప్రయోజనం తెచ్చిపెట్టవు. కానీ కూటమి అభ్యర్థుల ఎంపికలో ఏర్పడే విభేదాలు ప్రతిపక్షానికి అవకాశంగా మారవచ్చు. అధికార పక్షంలో టికెట్ దక్కని ప్రభావవంతమైన నాయకులు, నిర్లక్ష్యానికి గురయ్యామని భావించే సామాజిక వర్గాలు, పట్టణ సమస్యలపై అసంతృప్తితో ఉన్న ఓటర్లను చేరుకోగలిగితే వైసీపీ పోటీని బలోపేతం చేసుకోవచ్చు.అందుకు కేవలం ప్రభుత్వంపై విమర్శలు సరిపోవు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థుల్లో ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను ముందుకు తేవాలి. జనరల్ స్థానాల్లోనూ వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించడం ద్వారా తన ప్రాతినిధ్య వాదనను నిరూపించుకోవాలి. కూటమి ప్రకటనలకు వైసీపీ ఇవ్వగల బలమైన సమాధానం.. తన అభ్యర్థుల జాబితా.

## మంగళగిరి-తాడేపల్లి.. ప్రతిష్ఠకు కొత్త రూపం

మంగళగిరి-తాడేపల్లి మేయర్ పదవి ఎస్టీలకు కేటాయిస్తే ప్రధాన పార్టీల స్థానిక నాయకత్వానికి కొత్త అభ్యర్థిని ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఇప్పటివరకు పదవిపై ఆశలు పెట్టుకున్న ఇతర వర్గాల నాయకులు ప్రచార బాధ్యతల్లోకి మారాల్సి రావచ్చు.ఈ స్థానంలో గిరిజన అభ్యర్థిని నిలబెట్టడమే కాకుండా నగరమంతటా ఆమోదం పొందే నాయకత్వాన్ని నిర్మించడం కీలకం. పట్టణ సమస్యలపై అవగాహన, ప్రజలతో సంబంధాలు, పార్టీ యంత్రాంగం సహకారం కలిసి పనిచేస్తేనే రిజర్వేషన్ రాజకీయ విజయానికి పునాదవుతుంది. అభ్యర్థి స్వతంత్ర నాయకత్వానికి ఎంత స్థానం ఇస్తారన్నదీ ఇక్కడ పరీక్షే.

## మహిళా స్థానాల్లో.. ఎవరి నాయకత్వం?

విజయనగరం, గుంటూరు, శ్రీకాకుళం, కడప, గ్రేటర్ విశాఖ మేయర్ పదవులు జనరల్ మహిళలకు కేటాయిస్తే రెండు ప్రధాన పక్షాల్లో అభ్యర్థుల ఎంపిక విస్తృతంగా మారుతుంది. జనరల్ మహిళా స్థానం అంటే ఏ ఒక్క సామాజిక వర్గానికీ పరిమితమైన స్థానం కాదు. అర్హత కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలు కూడా పోటీ చేయవచ్చు.ఇక్కడ పార్టీలకు రెండు మార్గాలు కనిపిస్తాయి. ఇప్పటికే రాజకీయాల్లో పనిచేస్తున్న మహిళలకు అవకాశం ఇవ్వడం ఒకటి. ప్రభావవంతమైన నాయకుల కుటుంబ సభ్యులను రంగంలోకి దించడం మరొకటి. కుటుంబ నేపథ్యంతోపాటు అభ్యర్థి సొంత ప్రజాసంబంధాలు, సమస్యలపై అవగాహన కూడా ఓటర్ల పరిశీలనకు వస్తాయి. మహిళా ప్రాతినిధ్యాన్ని ప్రచారం చేసే పార్టీలకు.. ఎన్నిక తర్వాత వారికి నిర్ణయాధికారం కల్పించడం కూడా అంతే అవసరం.

## పల్నాడులో టికెట్‌తోనే మొదలయ్యే పోరు

చిలకలూరిపేట, గురజాల, నరసరావుపేట బీసీ మహిళలకు కేటాయిస్తే స్థానికంగా బలమైన బీసీ మహిళా నాయకత్వం కోసం పార్టీలు అన్వేషించాల్సి ఉంటుంది. సత్తెనపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల జనరల్‌లో ఉంటే ఆశావహుల మధ్య పోటీ విస్తృతంగా ఉండవచ్చు. అదే విధంగా దాచేపల్లి,గురజాల ను బీసీ జనరల్ కూడా కేటాయించినట్లు సమాచారం. అయితే దాచేపల్లి బీసి అయితే టిడిపికి అనుకూలంగా మారే అవకాశం ఉంది. అదే విధంగా గురజాల కూడా బీసీ జనరల్ ఉన్న నేపథ్యంలో ఇక్కడ పోటా పోటీ జరిగే అవకాశం ఉంది. ఈ పట్టణాల్లో రిజర్వేషన్ ప్రభావాన్ని స్థానిక నాయకుల సంబంధాలు, అభ్యర్థులపై ప్రజాభిప్రాయం, పార్టీ కార్యకర్తల సహకారంతో కలిపి చూడాలి. జనరల్ స్థానాల్లో బీసీలకు టికెట్లు ఇవ్వడం ద్వారా సామాజిక సమీకరణాన్ని విస్తరించే అవకాశం రెండు పక్షాలకూ ఉంటుంది. అయితే ఆ ఎంపిక వల్ల ఇతర ఆశావహుల్లో వచ్చే అసంతృప్తిని పరిష్కరించగలగాలి.

## ప్రకటనలో కూటమికి అవకాశం.. ఫలితంలో ఇద్దరికీ పరీక్ష

ప్రస్తుత పరిణామాల ఆధారంగా చూస్తే రిజర్వేషన్ల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లిన ప్రభుత్వంగా కూటమికి ప్రారంభ ప్రచార అవకాశం ఉంది. దాన్ని నిలబెట్టుకోవాలంటే సామాజిక ప్రాతినిధ్యం, మూడు పార్టీల సర్దుబాటు, స్థానికంగా ఆమోదం ఉన్న అభ్యర్థి ఎంపిక కలిసిరావాలి.వైసీపీకి ప్రయోజనం దక్కాలంటే అధికార పక్షంలోని విభేదాలపై ఆధారపడటంతోపాటు తన స్థానిక నాయకత్వాన్ని పునర్నిర్మించుకోవాలి. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్యం, పన్నులు వంటి పట్టణ సమస్యలపై విశ్వసనీయమైన ప్రత్యామ్నాయం చూపాలి. ఈ పురపోరులో రిజర్వేషన్ అభ్యర్థిని మార్చవచ్చు.. ప్రజల తీర్పును మార్చేది ఆ అభ్యర్థిపై నమ్మకం అందిన ప్రాథమిక జాబితాలో 17 కార్పొరేషన్లలో 13 పేర్లు మాత్రమే ఉన్నాయి; వాటిలో బీసీ స్థానాలు ఐదు. అయితే కొన్ని కేబినెట్ కథనాలు మేయర్ పదవుల్లో బీసీ వాటా 35.29 శాతంగా పేర్కొన్నాయి–17 స్థానాలకు ఇది ఆరు స్థానాలకు సమానం. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్లకు పేర్కొన్న 33.02 శాతం, 106 స్థానాలకు సుమారు 35 అవుతుంది; అందిన సమాచారంలో 36గా ఉంది. ఈ తేడాలను తుది అధికారిక జాబితాతో సరిచూడాలి. మహిళల 50 శాతం రిజర్వేషన్‌ను సామాజిక వర్గాల రిజర్వేషన్లకు అదనంగా కలిపి లెక్కించకూడదు..

# నలుగురు సజీవ దహనం!

- విజయవాడ పశ్చిమ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- రెయిలింగ్‌ను ఢీకొట్టిన కారు.. క్షణాల్లో చెలరేగిన మంటలు
- మృతుల్లో చిన్నారి.. మరొకరి పరిస్థితి విషమం
- నంబూరులో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా విషాదం
- మృతులు నంబూరు, నున్న ప్రాంతాలకు చెందినవారిగా గుర్తింపు
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి నారా లోకేశ్



**విజయవాడ, అక్టోబర్ 12 (స్పంద న్యూస్):** శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్న వారిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డుపై సోమవారం జరిగిన ఘోర ప్రమాదంలో నలుగురు సజీవ దహనమయ్యారు. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో చిక్కుకున్న నలుగురు మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఓ చిన్నారి కూడా ఉండటం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో మరొకరు తీవ్రంగా గాయపడగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా నంబూరులో జరిగిన ఓ శుభకార్యానికి హాజరైన కుటుంబ సభ్యులు తిరిగి కారులో బయలుదేరారు. విజయవాడ పశ్చిమ బైపాస్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వెంటనే వాహనంలో మంటలు చెలరేగాయి. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో కారులో ఉన్నవారు బయటకు రాలేకపోయినట్లు తెలుస్తోంది. క్షణాల్లోనే మంటలు వాహనాన్ని చుట్టుముట్టడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే కారు మంటల్లో చిక్కుకుంది. అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆయనకు అత్యవసర వైద్య చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిని రాందేవ్, అరుణ, విజయతోపాటు ఓ చిన్నారిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. వీరు గుంటూరు జిల్లా నంబూరు, విజయవాడ సమీపంలోని నున్న ప్రాంతాలకు చెందినవారని వెల్లడించారు. శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. సంతోషంగా గడిపిన కుటుంబ సభ్యులు తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురికావడం బంధువులను కలచివేసింది. ప్రమాదానికి గల కారణాలను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కారు అదుపుతప్పడానికి అతివేగం కారణమా? లేక ఇతర సాంకేతిక సమస్యలు ఏమైనా ఉన్నాయా? అనే అంశాలను పరిశీలిస్తున్నారు. రెయిలింగ్‌ను ఢీకొట్టిన వెంటనే మంటలు ఎలా చెలరేగాయన్న విషయంపైనా దృష్టి సారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ప్రమాదం తీవ్రంగా కలచివేసింది: నారా లోకేశ్

విజయవాడ పశ్చిమ బైపాస్‌పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో నలుగురు సజీవ దహనం కావడం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. మృతులకు నివాళులు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ ప్రమాదంతో విజయవాడ పశ్చిమ బైపాస్ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. ప్రమాదానికి గురైన కారు పూర్తిగా దగ్ధమవడం ఘటన తీవ్రతకు అద్దం పట్టింది. ఒకే ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోవడం, అందులో చిన్నారి కూడా ఉండటం స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

# తిరుపతి రూపురేఖలు మార్చే మహా ప్రణాళిక!

మొదటి పేజీ తరువాయి

లక్ష్యంగా ఈ ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు.

తిరుమలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలను ఒకేచోట అందించేందుకు అలిపిరి సమీపంలోని ఎస్వీ జంతు ప్రదర్శనశాల రహదారి వద్ద రూ.2,750 కోట్లతో సమీకృత యాత్రికుల టౌన్‌షిప్‌ను నిర్మించనున్నారు. ఇందులో రూ.1,332 కోట్లతో నాలుగు బ్లాకుల్లో పది అంతస్తుల చొప్పున 2,700 గదులు నిర్మించనున్నారు. వీటి ద్వారా రోజుకు సుమారు 15 వేల మంది భక్తులకు వసతి కల్పించనున్నారు. రూ.160 కోట్లతో ఒకేసారి ఆరు వేల మందికి అన్నప్రసాదం అందించే కేంద్రం, రూ.311 కోట్లతో 4,500 వాహనాలకు బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్సులు నిలిపే సౌకర్యమున్న సమీకృత రవాణా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. వైద్య సేవలు, విశ్రాంతి కేంద్రాలు, డిజిటల్ సమాచార వ్యవస్థలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుమల కొండపై వసతుల ఒత్తిడిని తగ్గించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. తిరుపతిలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు రూ.242 కోట్లతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. సుమారు 20 కిలోమీటర్ల మేర చేపట్టే పనుల్లో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ రూ.127 కోట్లతో 16.50 కిలోమీటర్లు, టీటీడీ రూ.115 కోట్లతో 3.60 కిలోమీటర్ల రహదారులను అభివృద్ధి చేయనున్నాయి. వీటి ద్వారా 140, 71 జాతీయ రహదారుల అనుసంధానం మెరుగుపడడంతోపాటు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు రవాణా సౌకర్యం పెరగనుంది. టీటీడీ ఉద్యోగుల కుటుంబాల సంక్షేమం కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్లను అభివృద్ధి చేయనున్నట్లు చంద్రబాబు తెలిపారు. మొదటి రెండు దశల్లో 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాల లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.230 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో టీటీడీ వాటా రూ.150 కోట్లు, ఉద్యోగుల వాటా రూ.80 కోట్లు ఉండనుంది. అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, విద్యుత్, మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నివాస సముదాయాన్ని పర్యావరణహితంగా, నికర కర్బన ఉద్గారాలు శూన్యంగా ఉండేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. భక్తులకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు రూపొందించిన వెంకటాద్రి యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. తిరుమల చరిత్ర, శ్రీవారి వైభవం, ఆధ్యాత్మిక సంప్రదాయాలను పరిచయం చేసేందుకు ప్రత్యేక యాత్రికుల



అనుభూతి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఆధునిక భద్రతా వ్యవస్థలు, అత్యవసర వైద్య కేంద్రాలు, డిజిటల్ సమాచార సౌకర్యాలను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో తిరుపతిలోనూ పవిత్రమైన ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించాలని స్పష్టం చేశారు. తిరుపతిలోని చెరువులను అనుసంధానించి సుందరీకరించాలని, కల్యాణి జలాశయం పరిసరాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు సూచించారు. ఔషధ మొక్కల ప్రాంతాన్ని ప్రకృతి, ఆధ్యాత్మిక అనుభూతి కేంద్రంగా తీర్చిదిద్దాలని చెప్పారు. వృక్షో గోవింద కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణ, గోశాలల నిర్వహణ, వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అన్నదానం, ప్రాణదానం, విద్యాదానం వంటి సేవలను విస్తరించడంతోపాటు ఇతర ఆలయాల్లోనూ సేవా వ్యవస్థను ప్రోత్సహించాలని సూచించారు. తిరుపతిని ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా వివాహ వేడుకలు, అంతర్జాతీయ సదస్సులు, క్రీడలు, పర్యాటకానికి ప్రధాన గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సమావేశ మందిరం, ఆంధ్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలను పెంచాలని అధికారులను ఆదేశించారు. దేవాదాయ, పర్యాటక, పురపాలక శాఖలు సమన్వయంతో పనిచేసి తిరుపతిని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం. రవిచంద్ర, పాలక మండలి సభ్యులు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్, తుడా అధికారులు తదితరులు దృశ్యమాధ్యమం ద్వారా పాల్గొన్నారు.

# వివేకా హత్య కేసు

## ఈడీ విచారణకు హాజరైన శివశంకర్ రెడ్డి

**అమరావతి, సెప్టెంబర్ 12 (స్పంద న్యూస్):**మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో 5వ నిందితుడిగా ఉన్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి ఈరోజు హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. హత్య కేసుతో సంబంధం ఉన్న ఆర్థిక లావాదేవీల గురించి అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారు. వివేకా హత్య కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, చార్జ్‌షీట్ల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసింది. ఈ హత్య వెనుక 40 కోట్ల సుపారీ లావాదేవీ జరిగిందని సీబీఐ తన చార్జ్‌షీట్‌లో ఆరోపించింది. ఈ నేపథ్యంలో హత్యకు సంబంధించిన ఆర్థిక మూలాలపై ఈడీ దృష్టి సారించింది. శివశంకర్ రెడ్డి ఈ కుట్రలో కీలకపాత్ర పోషించారని, నిధులను సమకూర్చుతానని హామీ ఇచ్చారని సీబీఐ ఆరోపణలు చేసింది. ఈ ఆరోపణల నేపథ్యంలోనే శివశంకర్ రెడ్డిని ఈడీ అధికారులు విచారిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి గత ఆగస్టులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డితో పాటు శివశంకర్ రెడ్డి ఇళ్లలోనూ ఈడీ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే.

# 11 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

## ఆమ్రపాలికి పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బాధ్యతలు

## తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు

**అమరావతి, సెప్టెంబర్ 12 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేసింది. మొత్తం 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో 2010 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి కాటకు కీలకమైన పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జారీ చేసిన జీవో నెం.1985 ప్రకారం.. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆమ్రపాలిని యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖలో ప్రభుత్వ కార్యదర్శిగా నియమించారు. ఆమె ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న 1992 బ్యాచ్ అధికారి షంషేర్ సింగ్ రావత్‌కు రిపోర్ట్ చేయనున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సౌరభ్ గౌర్‌ను న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమించారు. 2006 బ్యాచ్ అధికారి డి. మురళీధర్ రెడ్డికి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఇప్పటివరకు ఆ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.ఎం. నాయక్‌కు బాధ్యతల నుంచి ఉపశమనం లభించింది.

## ఇతర ముఖ్య నియామకాలు ఇలా ఉన్నాయి:

**మంజులే బాలాజీ దిగంబర్ (2009 బ్యాచ్):** ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి.

**కె. నీలకంఠ రెడ్డి (2017 బ్యాచ్):** యువజన సర్వీసుల డైరెక్టర్. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి ఐఎఫ్ఎస్ అధికారిణి ఎస్. భరణిని తప్పించారు.

**బి. అనిల్ కుమార్ రెడ్డి (2017 బ్యాచ్):** పరిశ్రమలు, వాణిజ్య శాఖలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ విభాగం సంయుక్త కార్యదర్శి.

**ఎన్. తేజ్ భరత్ (2018 బ్యాచ్):** ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి.

**ఎం. వరప్రసాద్:** ఏపీ పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్. ఈ పోస్టు పూర్తి అదనపు బాధ్యతల నుంచి కె. కన్నబాబుకు విముక్తి లభించింది.

**గెదెల శ్రీను:** స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ డిప్యూటీ సెక్రటరీ.

## ఇద్దరికి అదనపు బాధ్యతలు

ప్రస్తుతం ఉద్యానవన, సెరికల్చర్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ కె. శ్రీనివాసులుకు వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా, పరిశ్రమల డైరెక్టర్‌గా ఉన్న శుభమ్ బన్సల్‌కు ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని సాధారణ పరిపాలన శాఖ స్పష్టం చేసింది.

స్పందన
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం, 13 అక్టోబర్ 2026

# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో శ్రీశైలం జలాశయం

- దేశంలోనే తొలి ప్రాజెక్టుగా అరుదైన ఘనత!
- దక్షిణాసియాలోనే ప్రత్యేకమైన భారీ గేట్లు, నిర్మాణ పటిష్టతకు అంతర్జాతీయ గుర్తింపు
- 2009 భారీ వరదలను తట్టుకుని నిలిచిన వైనంపై ప్రశంసలు
- శ్రీశైలం ఎమ్మెల్యే, ఇరిగేషన్ అధికారులకు సర్టిఫికెట్లు అందజేత



**శ్రీశైలం, అక్టోబర్ 12 (స్పందన న్యూస్):** తెలుగు రాష్ట్రాల జీవనాడి, చారిత్రక కట్టడమైన శ్రీశైలం జలాశయం తాజాగా అరుదైన అంతర్జాతీయ ఘనతను సొంతం చేసుకుంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో శ్రీశైలం జలాశయానికి సముచిత స్థానం లభించింది. ఈ ఘనత సాధించిన దేశంలోని తొలి ప్రాజెక్టుగా శ్రీశైలం జలాశయం నిలవడం విశేషం. ఈ సందర్భంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ రీజినల్ జాయింట్ సెక్రటరీ ఇలియాజర్.. శ్రీశైలం ఎమ్మెల్యేకు, ఇరిగేషన్ శాఖ అధికారులకు అధికారిక సర్టిఫికెట్లను అందజేశారు. దక్షిణాసియాలో ఉన్న మరే ఇతర జలాశయాల్లోనూ లేని విధంగా శ్రీశైలం ప్రాజెక్టులో అత్యంత భారీ కొలతలతో కూడిన గేట్లు ఉండటం ఈ గుర్తింపునకు ప్రధాన ప్రాతిపదికగా నిలిచింది. ఇక్కడ గరిష్టంగా 60 అడుగుల వెడల్పు, 55 అడుగుల ఎత్తు కలిగిన భారీ స్పిల్‌వే గేట్లు అమర్చబడి ఉన్నాయి. జలాశయ నిర్మాణ శైలి, దాని సాంకేతిక సామర్థ్యం, వరదలను సమర్థంగా తట్టుకునే అద్భుతమైన ఇంజనీరింగ్ పటిష్టత ఈ అంతర్జాతీయ గుర్తింపునకు నిదర్శనంగా నిలిచాయని నిపుణులు కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009 సంవత్సరంలో సంభవించిన మహోగ్ర వరదల సమయంలో శ్రీశైలం జలాశయం తన అసాధారణ సామర్థ్యాన్ని నిరూపించుకుంది. ఆ సమయంలో రికార్డు స్థాయిలో ఏకంగా 25.4 లక్షల క్యూసెక్కుల భారీ వరద ప్రవాహం వచ్చిపడినప్పటికీ, జలాశయం ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా పటిష్టంగా నిలిచింది. నాటి వరదలను విజయవంతంగా ఎదుర్కొని ప్రాజెక్టు భద్రతను చాటిచెప్పిన ఆనాటి ఇంజనీర్ల కృషిని శ్రీశైలం ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రత్యేకంగా కొనియాడారు. ఈ జలాశయానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు వచ్చేలా అంకితభావంతో పనిచేసిన ఇరిగేషన్ శాఖ అధికారులను ఆయన అభినందించారు. ఈ రికార్డుతో శ్రీశైలం ప్రాజెక్టు కీర్తిప్రతిష్టలు ప్రపంచవ్యాప్తంగా మరింత ఇనుమడించాయని స్థానిక ప్రజలు, హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మహిళల భద్రతపై కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి!

- జేఎన్‌యూ లైంగిక వేధింపుల ఆరోపణలపై పురందేశ్వరి ధ్వజం
- రాహుల్, ప్రియాంక మౌనాన్ని ప్రశ్నించిన బీజేపీ ఎంపీ
- 11 మంది విద్యార్థినులపై వేధింపులంటూ తీవ్ర ఆరోపణలు
- అంతర్గత విచారణ కమిటీ నివేదికను ప్రస్తావించిన పురందేశ్వరి
- ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఢిల్లీలో బీజేపీ మహిళా మోర్చా నిరసన ప్రదర్శన



**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (స్పందన న్యూస్):** జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణల విషయంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మౌనంగా ఉండటాన్ని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్రంగా తప్పుబట్టారు. మహిళల భద్రత, గౌరవం గురించి మాట్లాడే కాంగ్రెస్ నాయకత్వం తమ పార్టీ ఎంపీపై ఆరోపణలు వచ్చినప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీని కాంగ్రెస్ కాపాడుతోందని, మహిళల హక్కుల విషయంలో ఆ పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. జేఎన్‌యూ పరిపాలన విభాగం నియమించిన అంతర్గత విచారణ కమిటీ నివేదికలో కాంగ్రెస్ ఎంపీ 11 మంది విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు తేలిందని పురందేశ్వరి పేర్కొన్నారు. ఇది కేవలం ఆరోపణ మాత్రమే కాదని, కమిటీ విచారణలో నిర్ధారణ అయిందని ఆమె వాదించారు. ఇంత తీవ్రమైన అంశం వెలుగులోకి వచ్చినా కాంగ్రెస్ అగ్రనేతలు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా ప్రచారం చేసే రాహుల్ గాంధీ ఈ వ్యవహారంలో మౌనంగా ఉండటం ద్వారా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని పురందేశ్వరి ఆరోపించారు. కనీసం బహిరంగ ప్రకటన కూడా చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మహిళల గౌరవాన్ని కాపాడతామని చెప్పే కాంగ్రెస్ నాయకత్వం ఇలాంటి ఆరోపణల విషయంలో స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆరోపణల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత ఎంపీపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే క్రమశిక్షణ చర్యలు తీసుకుని ఉండాల్సిందని పురందేశ్వరి అభిప్రాయపడ్డారు. అయితే అలా చేయకపోవడం ద్వారా ఆ పార్టీ మహిళల భద్రత విషయంలో తన చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేసుకుందని విమర్శించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులుగా తేలిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఢిల్లీలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పురందేశ్వరి నేతృత్వంలో చేపట్టిన ఆందోళనలో మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆరోపణలపై బాధ్యతాయుతంగా స్పందించాలని కాంగ్రెస్ నాయకత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలపై వేధింపుల ఆరోపణలు ఎవరి మీద వచ్చినా రాజకీయాలకు అతీతంగా విచారణ జరగాలని పేర్కొన్నారు.



# ప్రతి నియోజకవర్గంలో శ్రీవారి ఆలయం!

**రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఆలయాల నిర్మాణానికి నిర్ణయం**

**దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి**

**నెల్లూరు, అక్టోబర్ 12 (స్పందన న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా శ్రీవాణి ట్రస్టు భాగస్వామ్యంతో 5,000 నూతన ఆలయాలను నిర్మించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. నెల్లూరు జిల్లాలో పర్యటించిన ఆయన పొదలకూరు మండలం మహమ్మదాపురం గ్రామంలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి వైభవంగా భూమిపూజ నిర్వహించారు. ప్రతి నియోజకవర్గానికి రూ.5 నుంచి రూ.10 కోట్లు ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మొత్తం 175 శాసనసభ నియోజకవర్గాల్లోనూ ఒక్కో శ్రీవారి ఆలయాన్ని ప్రత్యేకంగా నిర్మించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించిందని తెలిపారు. ఈ బృహత్తర ప్రాజెక్టులో భాగంగా ప్రతి ఆలయ నిర్మాణానికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు నిధులు కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సనాతన ధర్మ ప్రచారాన్ని వేగవంతం చేయడంతో పాటు భక్తులకు స్థానికంగానే ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందుబాటులోకి తెచ్చేందుకే ఈ ప్రాజెక్టు చేపడుతున్నామని వివరించారు. అర్చకులకు ఆర్థిక భరోసా.. ఆత్మకూరు సమగ్రాభివృద్ధి రాష్ట్రంలో చిన్న చిన్న ఆలయాల నిర్వహణ సక్రమంగా సాగేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా 6,700 ఆలయాల్లో నిత్య ధూప, దీప, నైవేద్యాల కోసం అర్చకుల బ్యాంకు ఖాతాల్లో ప్రతి నెల రూ.10,000 చొప్పున నేరుగా జమ చేస్తున్నామని మంత్రి ఆనం తెలిపారు. అనంతరం ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో రూ.35 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన.. సోమశిల జలాశయం నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా ఆత్మకూరుకు శాశ్వత తాగునీటి సరఫరా వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. పట్టణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవనం, షాదీ మంజిల్ నిర్మాణాలకు కూడా నిధులు మంజూరు చేశామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలోనే అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఆనం స్పష్టం చేశారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

**దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన!**

**అక్టోబర్ 14 నుంచి కోస్తాంధ్ర, తమిళనాడు తీరాల్లో విస్తారంగా వానలు**

**రాయలసీమ, కేరళ, కర్ణాటకలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం**

**ఈశాన్య రుతుపవనాల రాకకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు**




**అమరావతి, అక్టోబర్ 12 (స్పందన న్యూస్):** దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రానున్న రోజుల్లో బలపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వాతావరణ వ్యవస్థ దక్షిణ బంగాళాఖాతం మీదుగా తమిళనాడు, శ్రీలంక తీరాల వైపు పయనిస్తుండటంతో దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వర్షాలు ఊపందుకోనున్నాయి. దీని ప్రభావంతో అక్టోబర్ 14 నుంచి దక్షిణ కోస్తాంధ్ర, తమిళనాడు తీర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన విస్తారమైన వర్షాలు ప్రారంభమై, అక్టోబర్ 15న కూడా కొనసాగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. అక్టోబర్ 16 నుంచి 19వ తేదీ మధ్య ఈ వర్షాలు మరింత బలపడి క్రమంగా లోతట్టు ప్రాంతాలకు విస్తరించనున్నాయి. ఈ వ్యవధిలో తమిళనాడులోని అంతర్గత జిల్లాలు, కేరళ, రాయలసీమ, దక్షిణ కర్ణాటకతో పాటు తీరప్రాంత కర్ణాటకలోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పిడుగులు, బలమైన ఈదురుగాలులతో కూడిన కుండపోత వానలు కురిసే ప్రమాదం ఉందని, తక్కువ సమయంలోనే అధిక వర్షపాతం నమోదు కావడం వల్ల అక్కడక్కడా ఆకస్మిక వరదలు సంభవించే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ చివరి దశకు చేరుకోవడంతో, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఈ నూతన వ్యవస్థ ఈశాన్య రుతుపవనాల ప్రవేశానికి మార్గం సుగమం చేస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. అక్టోబర్ 15 నుంచి 20 మధ్య కాలంలో ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే ప్రమాదం లేనప్పటికీ, అత్యంత భారీ వర్షపాతాన్ని నమోదు చేసే అవకాశం ఉన్నందున రైతులు, తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# ఫిర్యాదుల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

**ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి, సెప్టెంబర్ 12 (స్పంద న్యూస్):** ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అందుతున్న ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు. ప్రస్తుతం పీజీఆర్ఎస్ విధానం ద్వారా ప్రజల సమస్యలను వీలైనంత మేరకు పరిష్కరించగలుగుతున్నామని, మరింత వేగంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించాలని సీఎస్ సాయి ప్రసాద్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ సమావేశంలో 175 నియోజకవర్గాల నోడల్ అధికారులు ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత వాటిని పరిష్కరించే విషయంలో ఉద్యోగులకు, అధికారులకు జవాబుదారీతనం ఉండేలా చూడాలన్నారు. వివిధ శాఖలపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని... జారీ చేస్తున్న జీవోలను వక్రీకరిస్తూ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతున్నారన్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవోపై ఈ తరహా దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు సమర్థంగా సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు..

**విశాఖకు మహిళ, విజయవాడ అన్‌రిజర్వ్‌డ్**

**ఆంధ్రప్రదేశ్‌లోని 17 కార్పొరేషన్లకు మేయర్ రిజర్వేషన్లు ఖరారు**

**పురపాలక శాఖ నుంచి జీవో నెం. 252 జారీ**



**అమరావతి, అక్టోబర్ 12 (స్పంద న్యూస్) :** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ పదవుల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జీవో నెం. 252ను జారీ చేసింది. దీని ప్రకారం వివిధ సామాజిక వర్గాలకు, మహిళలకు కేటాయింపులు జరిగాయి. రాష్ట్రంలోని మొత్తం 17 కార్పొరేషన్లలో 5 స్థానాలను బీసీలకు, 2 ఎస్సీలకు, 1 ఎస్టీకి కేటాయించారు. మరో 5 కార్పొరేషన్లను జనరల్ కేటగిరీ మహిళలకు రిజర్వ్ చేయగా, మిగిలిన 4 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్‌గా (రిజర్వేషన్ లేనివి) ప్రకటించారు. ఈ రిజర్వేషన్ల ఖరారుతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతం కానుందని భావిస్తున్నారు.

**రిజర్వేషన్ల కేటాయింపు ఇలా ఉంది:**

**ఎస్టీ (ఒకటి):** మంగళగిరి–తాడేపల్లి
**ఎస్సీ (రెండు):** రాజమహేంద్రవరం, కర్నూలు
**బీసీ - మహిళ (రెండు):** మచిలీపట్నం, కాకినాడ
**బీసీ - జనరల్ (మూడు):** అనంతపురం, చిత్తూరు, ఏలూరు
**జనరల్ - మహిళ (ఐదు):** విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప, విశాఖపట్నం
**అన్‌రిజర్వ్‌డ్ (నాలుగు):** తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు

ఈ తాజా నోటిఫికేషన్‌తో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, గుంటూరు మేయర్ పీఠాలు మహిళలకు దక్కనుండగా, విజయవాడ, తిరుపతి వంటి కీలక కార్పొరేషన్లు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి. మేయర్ పదవుల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో, త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# గ్రామస్థాయి నుంచి పార్టీ బలాన్ని సమీకరించాలి

**సజ్జల రామకృష్ణారెడ్డి**

**తాడేపల్లి, అక్టోబర్ 12 (స్పంద న్యూస్) :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుబంధ విభాగాలన్నీ నిర్ణయాత్మక పాత్ర పోషించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గ్రామస్థాయి వరకు పార్టీ సంస్థాగత బలాన్ని క్రియాశీలం చేయడంతోపాటు న్యాయపరమైన సన్నద్ధత, డిజిటల్ ప్రచారం, సోషల్ మీడియా, దృశ్య ఆధారాల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్లతో నిర్వహించిన సమావేశంలో సజ్జల మాట్లాడారు. ప్రతి అనుబంధ విభాగం తమ పరిధిలోని వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. మహిళలు, యువత, విద్యార్థులు, రైతులు, బీసీలు, ఎస్సీలు, మైనారిటీలు, ఉద్యోగులు, పెన్షనర్లు, వృత్తి నిపుణులు తమ వర్గాలకు సంబంధించిన సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపాధి, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఎరువులు, విత్తనాలు, ఉద్యోగుల సమస్యలు, ధరల పెరుగుదల, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరిస్థితులను వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలోని పరిస్థితులతో పోల్చి ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం, 13 అక్టోబర్ 2026

## సంపాదకీయం



# జంతర్ మంతర్‌లో నిరసనలకు ఇక చోటులేదా?

### నిరసన వేదికల జాబితా నుంచి తొలగించినట్లు ప్రచారం

### కేంద్ర హోంశాఖ నిర్ణయంతో ఢిల్లీలో కొత్త చర్చ

### రామ్‌లీలా, బురాడీ, సీబీడీ మైదానాలు ప్రత్యామ్నాయాలుగా సూచన

### పార్లమెంటుకు సమీపంలోని నిరసన వేదికపై ఆంక్షల వివాదం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (స్పంద న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలకు, నిరసన ప్రదర్శనలకు కేంద్రంగా నిలిచిన జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన వేదికల జాబితా నుంచి తొలగించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇకపై జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అనుమతి ఉండదని, ఢిల్లీలోని మూడు ఇతర ప్రాంతాలను ఆందోళనల కోసం కేటాయించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ మార్పులకు సంబంధించిన అధికారిక ఉత్తర్వుల వివరాలు స్పష్టంగా వెల్లడికావాల్సి ఉంది. అందుతున్న సమాచారం ప్రకారం నిరసన ప్రదర్శనల కోసం రామ్‌లీలా మైదానం, బురాడీ మైదాన్, సీబీడీ గ్రౌండ్‌లను ప్రత్యామ్నాయ ప్రాంతాలుగా సూచించినట్లు తెలుస్తోంది. జంతర్ మంతర్ వద్ద నిరసనల నిర్వహణపై ఆంక్షలు విధించినట్లయితే రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆందోళనలపై ప్రభావం పడే అవకాశముంది. దేశ రాజధానిలోని జంతర్ మంతర్ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రముఖ వేదికగా గుర్తింపు పొందింది. పార్లమెంటుకు సమీపంలో ఉండటంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రజాసంఘాలు, ఉద్యమకారులు తమ డిమాండ్లను వినిపించేందుకు ఈ ప్రాంతాన్ని ఎంచుకునేవారు. రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళా సంఘాలు సహా అనేక వర్గాలు ఇక్కడ నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. జంతర్ మంతర్‌ను నిరసన వేదికల జాబితా నుంచి తొలగించారన్న ప్రచారం నేపథ్యంలో నిరసన తెలిపే హక్కు, ప్రజాస్వామ్యంలో ఆందోళనల ప్రాధాన్యం వంటి అంశాలు చర్చకు వస్తున్నాయి. ప్రత్యామ్నాయంగా సూచించిన ప్రాంతాలు పార్లమెంటుకు దూరంగా ఉండటంతో ప్రజా సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం మరింత కష్టమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ నిర్ణయం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటన్నది అధికారిక వివరణ ఆధారంగానే నిర్ధారించాల్సి ఉంది. జంతర్ మంతర్ వద్ద నిరసనల నిర్వహణపై గతంలోనూ వివిధ ఆంక్షలు, నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ప్రజల నిరసన తెలిపే హక్కుతోపాటు స్థానిక నివాసితుల ఇబ్బందులు, శాంతిభద్రతలు, ప్రజా రవాణా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందనే చర్చ అప్పటినుంచే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జంతర్ మంతర్ అధికారిక హోదాపై తాజాగా వెలువడుతున్న వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిరసనలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు జరిగితే వాటి అమలు విధానం, అనుమతుల ప్రక్రియ, ప్రత్యామ్నాయ వేదికల సౌకర్యాలపై స్పష్టత అవసరమవుతుంది. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పరిరక్షిస్తూనే శాంతిభద్రతలను కాపాడటం ప్రభుత్వ యంత్రాంగం ముందున్న ప్రధాన అంశంగా నిలుస్తుంది.

# ఇప్పుడు దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది

### నిరసన వేదిక గుర్తింపు రద్దుపై అభిజీత్ దిప్కే



- వెస్టిండీస్‌పై 14 పరుగుల తేడాతో భారత్ విజయం
- ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 2-1తో టీమిండియా ఆధిక్యం

**ఇండోర్, అక్టోబర్ 12 (స్పంద న్యూస్):** వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో భారత యువ క్రికెటర్ ప్రిన్స్ యాదవ్ అరుదైన ఘనత సాధించినట్లు వార్తలు వెలువడ్డాయి. పదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అతడు కేవలం ఆరు బంతుల్లో మూడు ఫోర్ల సహాయంతో 13 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. జట్టు భారీ స్కోరు సాధించడంలో చివరి వరుస బ్యాటర్‌గా కీలక పరుగులు జోడించాడు. భారత్ ఈ మ్యాచ్‌లో 14 పరుగుల తేడాతో విజయం సాధించిన నేపథ్యంలో ప్రిన్స్ చేసిన 13 పరుగులు ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మూడో టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 223 పరుగులు సాధించినట్లు అందిన వివరాలు పేర్కొంటున్నాయి. ఓపెనర్ అభిషేక్ శర్మ మెరుపు అర్ధశతకంతో ఆకట్టుకోగా, చివరి ఓవర్లలో ప్రిన్స్ యాదవ్ దూకుడుగా ఆడాడు. పదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగినప్పటికీ ఏమాత్రం వెనుకాడకుండా బౌండరీలు బాదాడు. ఆరు బంతులు ఎదుర్కొని మూడు ఫోర్లతో 13 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. బౌలింగ్‌లో నాలుగు ఓవర్లు వేసిన ప్రిన్స్ యాదవ్ 37 పరుగులు ఇచ్చి వికెట్ సాధించలేకపోయాడు. అయితే బ్యాటింగ్‌లో తనకు లభించిన కొద్దిపాటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. చివరి ఓవర్లలో అతడు జోడించిన పరుగులు జట్టు స్కోరును 223కు చేర్చడంలో ఉపయోగపడ్డాయి. ప్రత్యర్థికి 224 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించడంలో తనవంతు పాత్ర పోషించాడు. ఈ ఇన్నింగ్స్‌తో అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో పదో లేదా పదకొండో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఒకే ఇన్నింగ్స్‌లో కనీసం మూడు ఫోర్లు బాదిన భారత ఆటగాళ్ల జాబితాలో ప్రిన్స్ యాదవ్ చేరినట్లు పేర్కొంటున్నారు. గతంలో ఎస్. శ్రీశాంత్, రవిచంద్రన్ అశ్విన్ ఈ ఘనత సాధించారు. శ్రీశాంత్ 2007లో న్యూజిలాండ్‌పై, అశ్విన్ 2011లో కోల్‌కతాలో ఇంగ్లాండ్‌పై జరిగిన టీ20లో మూడు బౌండరీలు సాధించినట్లు వివరాలు చెబుతున్నాయి. అశ్విన్ తర్వాత దాదాపు 15 ఏళ్లకు ప్రిన్స్ ఈ జాబితాలో చేరినట్లు సమాచారం. భారత్ నిర్దేశించిన 224 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 209 పరుగులకే పరిమితమైనట్లు మ్యాచ్ వివరాలు పేర్కొంటున్నాయి. దీంతో భారత్ 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పరుగుల వేటను అడ్డుకున్నారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2--1 ఆధిక్యంలోకి వెళ్లినట్లు సమాచారం. సాధారణంగా భారీ స్కోర్లలో అగ్రశ్రేణి బ్యాటర్ల ప్రదర్శనకే ఎక్కువ గుర్తింపు లభిస్తుంది. అయితే చివరి వరుస బ్యాటర్లు సాధించే కొద్దిపాటి పరుగులు కూడా మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేస్తాయని ప్రిన్స్ యాదవ్ ఇన్నింగ్స్ మరోసారి గుర్తుచేసింది. కేవలం ఆరు బంతుల్లోనే మూడు బౌండరీలు సాధించి జట్టుకు ఉపయోగపడే పరుగులు అందించిన ప్రిన్స్ ప్రదర్శన క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది.

















# తల్లి బాటలో తనయు..

## టాలీవుడ్‌లోకి మరో అందాల వారసురాలు!

**హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమవుతున్న శ్రీకాంత్-ఊహల కుమార్తె మేధా మేక**

**హైదరాబాద్, అక్టోబర్ 12 (స్పంద న్యూస్):** తెలుగు చిత్ర పరిశ్రమలోకి మరో సినీ వారసురాలు అడుగుపెడుతోంది. టాలీవుడ్ సీనియర్ కథానాయకుడు శ్రీకాంత్, ఒకప్పటి కథానాయిక ఊహల కుమార్తె మేధా మేక హీరోయిన్‌గా వెండితెరకు పరిచయం కాబోతోంది. ఇప్పటికే వీరి పెద్ద కుమారుడు రోషన్ మేక కథానాయకుడిగా సినీ రంగంలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తుండగా, ఇప్పుడు కుమార్తె మేధా కూడా తల్లిదండ్రుల బాటలో నటిగా అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రంతో ఆమె ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన రొమాంటిక్ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో ఆకట్టుకుంటోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి యువ దర్శకుడు పృథ్వీ వనం దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు ప్రేక్షకుల్లో విశేష ఆదరణ పొందిన '30 వెడ్స్ 21' వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహించిన పృథ్వీ వనం మరోసారి ప్రేమకథా నేపథ్యంలో సినిమా రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో జై జాస్తి కథానాయకుడిగా నటిస్తుండగా, మేధా మేక కథానాయికగా పరిచయమవుతోంది. వీరిద్దరి జంటను పరిచయం చేస్తూ చిత్రబృందం విడుదల చేసిన పోస్టర్ సినీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కొత్త సినిమా పేరును ఇంకా ప్రకటించని నిర్మాతలు ప్రస్తుతం 'మైత్రీ ఇన్ లవ్' అనే ప్రచార నినాదంతో చిత్రాన్ని పరిచయం చేస్తున్నారు. తాజాగా విడుదల చేసిన రొమాంటిక్ పోస్టర్‌లో జై జాస్తి, మేధా మేక జంట ఆకట్టుకునేలా కనిపిస్తోంది. వీరిద్దరి మధ్య ప్రేమకథ ఎలా సాగనుంది, సినిమా కథాంశం ఏమిటి అనే విషయాలపై ఆసక్తి నెలకొంది. త్వరలోనే సినిమా పేరును అధికారికంగా వెల్లడించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థ ద్వారా మేధా మేక కథానాయికగా పరిచయం కావడం విశేషంగా మారింది. సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు, విడుదల తేదీకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు సమాచారం. శ్రీకాంత్, ఊహల పెద్ద కుమారుడు రోషన్ మేక ఇప్పటికే తెలుగు చిత్ర పరిశ్రమలో కథానాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 'పెళ్లి సందడి' చిత్రంతో ప్రేక్షకులకు చేరువైన రోషన్ ప్రస్తుతం తన నాలుగో చిత్రం 'ఏమో ఏమో ఇది' విడుదల కోసం సిద్ధమవుతున్నాడు. ఇప్పుడు అతడి సోదరి మేధా కూడా నటిగా పరిచయం అవుతుండటంతో శ్రీకాంత్ కుటుంబం మరోసారి సినీ వార్తల్లో నిలిచింది. మేధా మేకకు నటనతోపాటు క్రీడలపైనా ఆసక్తి ఉంది. జాతీయ స్థాయిలో బాస్కెట్‌బాల్ క్రీడాకారిణిగా రాణించిన ఆమె ఇప్పుడు సినీ రంగంలో తన ప్రతిభను నిరూపించుకునేందుకు సిద్ధమవుతోంది. తల్లి ఊహ నటిగా తెలుగు ప్రేక్షకుల్లో సంపాదించుకున్న గుర్తింపును మేధా కూడా అందుకుంటుందా అనే ఆసక్తి నెలకొంది. ఊహ 'ఆమె' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆమె కుమార్తె కూడా కథానాయికగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించనుండటంతో సినీ అభిమానుల దృష్టి ఈ చిత్రంపై పడింది.



# అతడి నిర్ణయమే ఫైనల్..

**పెళ్లి పుకార్లపై మమితా బైజు క్లారిటీ**

**కొచ్చి, అక్టోబర్ 12 (స్పంద న్యూస్):** మలయాళ కల్ట్ హిట్ 'ప్రేమలు' చిత్రంతో తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ ఫ్యాన్ బేస్‌ను సొంతం చేసుకున్న యువ నటి మమితా బైజు తనపై వస్తున్న పెళ్లి పుకార్లకు సోషల్ మీడియా వేదికగా చెక్ పెట్టారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ వివాహం గురించి ఇటీవల నెట్టింట రకరకాల వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో స్పందించిన మమితా బైజు, తన జీవితంలో ప్రతీ కీలక నిర్ణయం వెనుక తన సోదరుడే ఉంటాడని స్పష్టం చేశారు. తాను ఎవరిని వివాహం చేసుకుంటాననే విషయంతో సహా కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ప్రతీ అడుగును తన సోదరుడు మిథున్ బైజు నిర్ణయిస్తాడని మమితా బైజు తెలిపారు. "నాకు, నా సోదరుడు మిథున్ బైజుకు మధ్య బంధం కేవలం అన్నాచెల్లెళ్ల అనుబంధం మాత్రమే కాదు.. మేం మంచి స్నేహితుల కంటే ఎక్కువే. నా జీవితానికి సంబంధించి ఏ నిర్ణయమైనా మిథునే తీసుకుంటాడు. నా పెళ్లి విషయంలోనూ నా అన్న తీసుకునే నిర్ణయమే అంతిమం. అంతేకాదు, నాకు వచ్చే లవ్ ప్రపోజల్స్‌ను కూడా అతడే స్వయంగా హ్యాండిల్ చేస్తాడు" అని ఆమె వివరించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో తన పెళ్లి వార్తలపై స్పందిస్తూ.. 'ఏంటీ..?' అని రాసి ఉన్న డైలామాతో కూడిన ఒక మినియన్ స్టిక్కర్‌ను పోస్ట్ చేశారు. ప్రస్తుతం మమితా బైజు చేసిన ఈ కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారడంతో, ఆమె పెళ్లిపై వస్తున్న రూమర్స్‌కు ఫుల్‌స్టాప్ పడినట్లయింది. సినిమాల విషయానికి వస్తే.. ఇటీవలే సూర్య సరసన నటించిన సినిమాతో పాటు పలు ప్రాజెక్ట్‌లతో ఆమె వరుస విజయాలను అందుకుంటూ దూసుకెళ్తున్నారు.




# పవన్ సినీ ప్రయాణానికి 30 ఏళ్లు..

**ఎమోషనల్ పోస్ట్‌తో శుభాకాంక్షలు తెలిపిన అల్లు అరవింద్!**

**హైదరాబాద్, అక్టోబర్ 12 (స్పంద న్యూస్):** టాలీవుడ్ పవర్ స్టార్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలుగు సినీ పరిశ్రమలో అడుగుపెట్టి మూడు దశాబ్దాలు (30 ఏళ్లు) పూర్తి చేసుకున్నారు. తనదైన మేనరిజం, యాక్షన్ శైలితో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఆయన.. సినిమాలతో పాటు రాజకీయ రంగంలోనూ తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. పవన్ కల్యాణ్ తొలి సినిమా విడుదలై 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ నిర్మాణంలో, ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో తెరకెక్కిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రం ద్వారా 1996 అక్టోబర్ 11న పవన్ కల్యాణ్ కథానాయకుడిగా తెలుగు తెరకు పరిచయమయ్యారు. అక్కినేని కుటుంబానికి చెందిన సుప్రియ యార్లగడ్డ ఈ చిత్రంతో నాయికగా ఎంట్రీ ఇచ్చారు. ఈ సినిమాతో ప్రారంభమైన పవన్ కల్యాణ్ ప్రయాణం నేడు మూడు దశాబ్దాలు పూర్తి చేసుకోవడం విశేషం. ఈ మైలురాయి సందర్భంగా పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి అల్లు అరవింద్ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. "మేమిద్దరం కలిసి పనిచేసిన తొలి సినిమా విడుదలై నేటికి 30 ఏళ్లు పూర్తయ్యాయంటే నమ్మలేకపోతున్నాను. పవన్ కల్యాణ్ సినీ ప్రయాణం అద్భుతంగా సాగింది. ఈ ప్రత్యేక మైలురాయిని చేరుకున్న సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక అభినందనలు" అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన ఎంచుకునే ప్రతి మార్గంలో మరిన్ని విజయాలు సాధించాలని, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని ఆకాంక్షించారు. సినిమాలే కాకుండా సమాజం పట్ల ఆయన చూపుతున్న దృక్పథాన్ని, అందిస్తున్న సేవలను అల్లు అరవింద్ ఈ సందర్భంగా అభినందించారు.

# నాని 'బ్లడీ రోమియో'.. షూటింగ్ డేట్ ఫిక్స్!



నేచురల్ స్టార్ నాని కొత్త అవతారంలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'సాహో', 'ఓజీ' చిత్రాలతో స్టైలిష్ యాక్షన్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ డైరెక్టర్ సుజీత్‌తో కలిసి ఆయన చేస్తున్న సినిమా 'బ్లడీ రోమియో'. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా షూటింగ్ షెడ్యూల్ వివరాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అక్టోబర్ 17 నుంచి ఢిల్లీలో సినిమా షూటింగ్ స్టార్ట్ కానున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత లండన్, హైదరాబాద్‌లోనూ కీలక సన్నివేశాలను తెరకెక్కించేందుకు చిత్ర బృందం ప్లాన్ రెడీ చేసినట్లు సమాచారం. ఈ సినిమాలో నాని పాత్రకు సంబంధించిన వివరాలు కూడా ఆసక్తికరంగా మారాయి. ఒకవైపు చెఫ్‌గా కనిపిస్తూనే, మరోవైపు గ్యాంగ్‌స్టర్‌గా హింసాత్మక యాంగిల్‌ని ప్లే చేసే పాత్రలో ఆయన కనిపించనున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ రెండు విభిన్నమైన షేడ్స్‌ను డైరెక్టర్ సుజీత్ ఎలా చూపించబోతున్నారన్నది ఆసక్తిని రేకెత్తిస్తోంది. డార్క్ హ్యూమర్, స్టైలిష్ యాక్షన్ అంశాలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక 'ది ప్యారడైజ్'లోని రగ్డ్ లుక్‌కు భిన్నంగా నాని ఈ సినిమా కోసం రెట్రో స్టైల్‌లో కనిపిస్తుండటం అభిమానుల్లో చర్చనీయాంశమైంది. కొత్త హెయిర్‌స్టైల్, బ్లాక్ గాగుల్స్‌తో ఆయన కనిపిస్తున్న లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. అక్టోబర్ 17న ఢిల్లీలో ప్రారంభమయ్యే తొలి షెడ్యూల్ తర్వాత లండన్, హైదరాబాద్‌లలోనూ షూటింగ్ జరగనుందని సమాచారం. అయితే ఈ షూటింగ్ షెడ్యూల్ వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రంలో నాని సరసన ప్రీతి ముకుందన్ నటించనున్నట్లు ప్రచారం జరుగుతుంది. అలాగే ఈ సినిమాలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. నాని న్యాచురల్ యాక్టింగ్‌కి, సుజీత్ స్టైలిష్ మేకింగ్ తోడైతే 'బ్లడీ రోమియో' ఎలా ఉండబోతోందన్న ఆసక్తి నెలకొంది.

**పెళ్లి చేసుకున్నా, చేసుకోకపోయినా పర్వాలేదు..**

# పిల్లల్ని మాత్రం కనండి

**నటుడు నరేశ్ హాట్ కామెంట్స్!**



**హైదరాబాద్, అక్టోబర్ 12 (స్పంద న్యూస్):** టాలీవుడ్ సీనియర్ నటుడు నరేశ్ తనదైన శైలి వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లో నిలిచారు. అనుపమ పరమేశ్వరన్, నరేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా కుటుంబ కథాచిత్రం 'క్రేజీ కల్యాణం' ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. "పెళ్లి చేసుకున్నా, చేసుకోకపోయినా పర్వాలేదు.. పిల్లల్ని మాత్రం కనండి" అంటూ ఆయన చేసిన కామెంట్స్ నెటిజన్ల మధ్య తీవ్ర చర్చకు దారితీశాయి. బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన 'క్రేజీ కల్యాణం' ట్రైలర్ విడుదల వేడుకలో ప్రస్తుత తరం పెళ్లిళ్లు, సహజీవన పోకడలపై నరేశ్‌ను మీడియా ప్రశ్నించింది. దీనికి ఆయన స్పందిస్తూ.. నేటి పరిస్థితుల్లో పెళ్లి చేసుకోవడం లేదా చేసుకోకపోవడం వ్యక్తిగత ఇష్టమని, సహజీవనం కూడా సాధారణమైపోయిందని తెలిపారు. అయితే వివాహ వ్యవస్థ ఎలా ఉన్నప్పటికీ పిల్లలను కనడం మాత్రం ముఖ్యమనే రీతిలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తించాయి. ఇక సినిమాలో అనుపమ పరమేశ్వరన్, నరేశ్ తండ్రీకూతుళ్లుగా నటిస్తున్నారు. కూతురికి నచ్చిన సంబంధం చేయాలని తండ్రి పట్టుదలగా ఉండటం, తాను ప్రేమించిన వ్యక్తినే పెళ్లి చేసుకోవాలని కూతురు ప్రయత్నించడం వంటి ఆసక్తికర సంఘటనలతో ఈ సినిమా తెరకెక్కింది. అమెరికా సంబంధం నుంచి తప్పించుకోవడానికి కూతురు చేసే ప్రయత్నాలు, తండ్రీకూతుళ్ల మధ్య భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. పూర్తి వినోదాత్మక కుటుంబ కథాంశంతో రూపొందిన ఈ సినిమా అక్టోబర్ 16న దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

"This newspaper is published by **JAMMUGANI MOHAN** from D.No. 13-19 Selapadu, Guntur, Andhrapradesh - 522213. on behalf of AK PUBLICATIONS, Editor by **JAMMUGANI MOHAN** and printed by JANAPATI VENKATA RAMESH BABU at D.NO. 5-74A, GANGIREDDY PALEM, BELLAMKONDA, GUNTUR, ANDHRA PRADESH - 522411." **PRGI NO: APMUL/26/A3106**. Email: epaper.spandanews@gmail.com , Cell: **94908 24686**

## దసరా వేళ హేమంత్ ఇంట్లో వికసించిన బ్రహ్మకమలం



పుంగనూరు అక్టోబర్ 12 (స్పంద న్యూస్) పట్టణానికి చెందిన హేమంత్ రాయల్ ఇంటి ఆవరణలో పెంచుకుంటున్న బ్రహ్మకమలం మొక్కకు ఆదివారం అర్ధరాత్రి పుష్పాలు వికసించాయి. ఇంట్లో దుర్గాదేవి పూజ నిర్వహించిన అనంతరం పుష్పాలు వికసించడాన్ని కుటుంబ సభ్యులమంతా చూసి ఎంతో సంతోషించామని హేమంత్ తెలిపారు. సాధారణంగా బ్రహ్మకమలం పుష్పాలు రాత్రివేళ వికసించి తెల్లని రేకులతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని హేమంత్ పేర్కొన్నారు. ఇలా జరగడం అమ్మవారి అనుగ్రహంగా అభిప్రాయపడుతున్నామని హేమంత్ రాయల్ తెలిపారు.

## రూ.60 లక్షలతో నిర్మించిన సఖీ వన్ స్టాప్ సెంటర్ ప్రారంభం

### ఆపదలో ఉన్న మహిళలకు అండగా సఖీ కేంద్రాలు: ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు



బాపట్ల అక్టోబర్ 12(స్పంద న్యూస్ ):: ఆపదలో ఉన్న మహిళలకు రక్షణ, భరోసా కల్పించడంలో సఖీ వన్ స్టాప్ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. బాపట్ల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ వెనుక సుమారు రూ.60 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సఖీవన్‌స్టాప్ సెంటర్ భవనాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హింస, వేధింపులకు గురైన మహిళలకు ఒకే చోట వైద్య సహాయం, న్యాయ సహాయం, మానసిక కౌన్సెలింగ్, తాత్కాలిక ఆశ్రయం వంటి సేవలు అందించడమే సఖీ కేంద్రం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మహిళల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. బాధిత మహిళలకు సకాలంలో న్యాయం అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, వారికి అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు.అనంతరం నూతన భవనంలోని వసతులు, కౌన్సెలింగ్ గదులు, వైద్య సహాయ విభాగం తదితర సదుపాయాలను ఎమ్మెల్యే పరిశీలించారు. కేంద్రానికి వచ్చే బాధిత మహిళలకు మెరుగైన సేవలు అందించేలా సిబ్బంది విధులు నిర్వహించాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.32 లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనం ప్రారంభం

### గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు



బాపట్ల అక్టోబర్ 12(స్పందన్యూస్): గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలిపారు. బాపట్ల మండల పరిధిలోని తూర్పు పిన్నిబోయినవారిపాలెం గ్రామంలో సుమారు రూ.32 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు మరింత సులభంగా, పారదర్శకంగా, వేగంగా అందించాలనే ఉద్దేశంతో ఆధునిక వసతులతో నూతన పంచాయతీ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. గ్రామస్తులు తమ పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, గ్రామంలోనే అన్ని పాలనా సేవలు పొందేలా పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.అనంతరం నూతన భవనంలోని కార్యాలయ గదులు, రికార్డుల గదితో పాటు ఇతర విభాగాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా విధులు నిర్వహించాలని అధికారులకు, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెదకూరపాడు నూతన ఎస్సైగా సంధ్యారాణి బాధ్యతల స్వీకరణ

### శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



పెదకూరపాడు అక్టోబర్ 12(స్పంద న్యూస్): పల్నాడు జిల్లా పెదకూరపాడు పోలీస్‌స్టేషన్ నూతన సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా సంధ్యారాణి సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై పెదకూరపాడుకు వచ్చిన ఆమె గతంలో దాచేపల్లి, మాచర్ల, అచ్చంపేట పరిసర ప్రాంతాల్లో ఎస్సైగా విధులు నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సంధ్యా రాణిని పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై సంధ్యారాణి మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎవరైనా సంఘవిద్రోహ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ముఖ్యంగా యువత గంజాయి, పొగాకు తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల బారిన పడకుండా, తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.

### జాతీయ సరస్ మేళాకు

## మంత్రి లోకేష్ కు ఆహ్వానం



అమరావతి అక్టోబర్ 12 (స్పంద న్యూస్): విజయవాడ పున్నమి ఘాట్ లో ఈ నెల 13 నుంచి 31వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జాతీయ సరస్ మేళాకు హాజరుకావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కు ఆహ్వానం పలికారు. ఈ మేరకు సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, మెప్మా ఎండీ జి.బాలకృష్ణ, దేశంలోని పొదుపు సంఘాల మహిళల తరపున ఎన్టీఆర్ జిల్లా డీఆర్ డీఏ జిల్లా సమాఖ్య అధ్య క్షులు కల్పన.. ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. జాతీయ సరస్ మేళా మొట్టమొదటిసారిగా విజయవాడలో జరగనుంది. ఈ మేళాలో అన్ని రాష్ట్రాల నుంచి వారి స్థానిక ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయి. ఈ నెల 15వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారి చేతుల మీదుగా ఈ మేళా ప్రారంభం కానుంది. మంత్రి లోకేష్ ను ఆహ్వానించిన వారిలో ఎన్టీఆర్ జిల్లా డీఆర్ డీఏ జిల్లా సమాఖ్య ఉపాధ్యక్షులు ఎన్.బేబీ, కార్యదర్శి బి.రామలక్ష్మి, కోశాధికారి సీహెచ్ హైమావతి తదితరులు ఉన్నారు.

## గుంటూరులో శతచండీ లలితా పూజా మహోత్సవం



గుంటూరు, పట్టాభిపురం అక్టోబర్ 12(స్పంద న్యూస్ ):: స్వామి థియేటర్ వద్ద శతచండీ లలితా పూజా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. చండీ పారాయణం, చండీ హోమం, అమ్మవారికి అభిషేకం, శ్రీ సూక్తం, పురుష సూక్తం, లలితా సహస్రనామార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు 500 మంది మహిళలతో భగవద్గీత పారాయణం, సాయంత్రం ప్రదోషకాల అర్చన, హోమం, సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి విఘ్నేశ్వర స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం, అనంతరం సప్తహారతులు జరగనున్నాయి. పండ్లు, పూలు, అరిటాకులు, ఇతర ఆకులతో తయారు చేసిన ప్రకృతి సిద్ధమైన అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సకల జనులు సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలంతా బాగుండాలని సంకల్పంతో ఈ పూజలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త బొమ్మిడాల కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు లక్ష్మి, సోమరి వెంకటేశ్వరరావు తదితరులు హాజరు కానున్నారు. అలాగే గంది కాంతారావు, నేరెళ్ల వెంకట హరిప్రసాద్, ఈగంటి వరప్రసాద్, కాశీనాథ్ బాబు తదితరులు పాల్గొననున్నారు.

### సాయుధ దళాల పతాక దినోత్సవానికి

## మహిళా సంఘాలు రూ.6.92 లక్షల విరాళం



### సైనికులు, అమర జవాన్ల కుటుంబాల సంక్షేమానికి చేయూత

కలెక్టరేట్ అక్టోబర్ 12(స్పంద న్యూస్ ): సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా మహిళా సంఘాలు రూ.6.92 లక్షల విరాళాన్ని అందించి ఆదర్శంగా నిలిచాయి. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మకు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న సైనికులు, మాజీ సైనికులు, యుద్ధంలో గాయపడిన సైనికులు, అమర జవాన్ల కుటుంబాల సంక్షేమానికి మహిళా సంఘాలు విరాళం అందించడం అభినందనీయమని అన్నారు.సైనికుల త్యాగాలను స్మరించుకోవడం, దేశం కోసం వారు చేస్తున్న సేవలకు కృతజ్ఞతలు తెలియజేయడం, వారి కుటుంబాలకు అండగా నిలవడం సాయుధ దళాల పతాక దినోత్సవ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. సైనికుల సంక్షేమానికి మహిళా సంఘాలు ముందుకొచ్చి విరాళం అందించడం స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి ఆర్. గుణశీల, డీఆర్‌డీఏ ఏపీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### సేవా సంకల్ప అభియాన్‌లో

## నవజాత శిశువులకు దుస్తుల పంపిణీ

### ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా సేవా కార్యక్రమం

గుంటూరు అక్టోబర్ 12(స్పంద న్యూస్ ): భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా సోమవారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో నవజాత శిశువులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.బీజేపీ సీనియర్ నాయకుడు పోతురాజు వెంకట్ సహకారంతో జీజీహెచ్‌లోని జింఖానా ఆరోగ్యశ్రీ కేంద్రం, కాన్పుల వార్డులో జన్మించిన చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ తన చేతుల మీదుగా చిన్నారులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మోతే శేషగిరి, జిల్లా నాయకుడు దేసు సత్యనారాయణ, ఓబీసీ జిల్లా కోశాధికారి శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి బి. ఉషారాణి, దేవరపల్లి నిర్మల రాణి, మంగమ్మ, బోరుగడ్డ బాబురావు, పి.వి. రమ, పి. శివకుమారి, ఓ. రమణ, పి. శ్యామల, ఎస్‌కే హుస్సేన్ బీ తదితరులు పాల్గొన్నారు. ప్రధాని జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహిస్తూ, నవజాత శిశువులకు దుస్తులు అందించడం ద్వారా సామాజిక సేవలో భాగస్వాములయ్యారు.



## ఉత్కంఠ కు తెర..

- -మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారు.
- -గురజాల, దాచేపల్లి అన్ రిజర్వడ్, పిడుగురాళ్ల బిసి జనరల్.




దాచేపల్లి, అక్టోబరు 12(స్పంద న్యూస్ ). సుమారు 10 రోజుల ఉత్కంఠ కు తెరపడింది. సోమవారం మధ్యాహ్నం మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు చేస్తు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం లోని మూడు మున్సిపాలిటీల రిజర్వేషన్లు ప్రజలను షాక్ గురిచేస్తూ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. మొదటి నుండి బిసి అని ప్రచారం జరుగుతున్న దాచేపల్లి మున్సిపాలిటీ అన్ రిజర్వడ్ కాగా, ఎస్సీ రిజర్వేషన్ వస్తుందనుకున్న పిడుగురాళ్ల మున్సిపాలిటీ బిసి జనరల్, అధేవిదంగా గురజాల మున్సిపాలిటీ కూడా అన్ రిజర్వుడు కావటం తో బిసివర్గాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. దాచేపల్లి బిసి రిజర్వేషన్ వస్తుందనే ప్రచారం తో ఇప్పటి వరకు కొంచెం స్తబ్ధుగా ఉన్న ఒసి వర్గాలు, అన్ రిజర్వడ్ కావటం తో ఇరు పార్టీలలోని ఆశావాహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు ఉత్సాహం గా ఉన్న బిసి నేతలు ఒక్కసారిగా ఢీలా పడ్డారు. రిజర్వేషన్లు ఖరారు కావడం తో రాజకీయ పార్టీల వ్యూహ, ప్రతివ్యూహాలు తెరమీదకు వచ్చాయి. అధేవిదంగా మున్సిపల్ వార్డుల రిజర్వేషన్లు ఖరారు కావడం తో ఇరు పార్టీలు అభ్యర్థులను ఖరారు చేసే ప్రక్రియ ను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే యరపతినేని కూటమి పార్టీల సమావేశం మంగళవారం దాచేపల్లి మార్కెట్ యార్డు లో నిర్వహించనున్నట్లు తెలిసింది. వైసిపి కి సంబంధించి నియోజకవర్గ, సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పిడుగురాళ్ల లో పార్టీ కార్యాలయం లో మున్సిపాలిటీ ల వారీగా నాయకులతో మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. రెండు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన అనంతరం ఎన్నికలు రాజకీయం మరింత వేడెక్కే అవకాశం కనిపిస్తుంది. కూటమి లో ఇప్పటికే ఇద్దరు, ముగ్గురు ఆశావాహులు మేము పోటి చేస్తాం.. అంటూ చెప్పుకుంటుండగా, ప్రతిపక్ష వైసిపి పోటీకి నిలిపే అభ్యర్థులలో గోప్యత పాటిస్తున్నట్లు తెలుస్తుంది. అధికార పార్టీ ఏలాగైనా నియోజకవర్గం లోని మూడు మున్సిపాలిటీలను కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉండగా, ఎట్టి పరిస్థితుల్లో అధికార పార్టీ గెలుపు ను అడ్డుకోవాలనే అచితూచి వ్యవహారిస్తుంది. రానున్న రోజుల్లో రాజకీయం మరింత రంజుగా ఉండే పరిస్థితులు కన్పిస్తున్నాయని ప్రజల్లో చర్చ నడుస్తుంది.

### మిన్నంటిన సమన్వయకర్త

# డాక్టర్ సుధీర్ భార్గవరెడ్డి జన్మదిన వేడుకలు

## చేజర్ల కపోతేశ్వరాలయంలో ప్రత్యేక పూజలతో ప్రారంభమైన కార్యక్రమం

సత్తెనపల్లి,అక్టోబర్ (స్పంద): సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 11,సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు ఏర్పాటుచేసిన కేకును కట్ చేసిన భార్గవ రెడ్డి, అనంతరం గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళ్లి పేషెంట్లకు పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నకరికల్లు మండలం చేజర్ల గ్రామంలో కపోతేశ్వర స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తలు ఏర్పాటుచేసిన జన్మదినోత్సవ కేకును కట్ చేశారు. అనంతరం ఇసప్పాలెం గ్రామంలో మహంకాళేశ్వర అమ్మవారిని దర్శించుకున్న భార్గవ రెడ్డి,అనంతరం ముప్పాళ్ళ మండలం చాగంటి వారి పాలెం గ్రామంలో సాయిబాబా దేవస్థానం నందు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.

అనంతరం సత్తెనపల్లి పట్టణం పరివర్తన నందు కేక్ కట్ చేసి పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం పోలీసుల హైడ్రామాతో, భార్గవ రెడ్డి కాలినడకన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకొని, నాయకులు ఏర్పాటు చేసిన జన్మదినోత్సవ కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.

అనంతరం రాజుపాలెం మండలం కొండమూడు గ్రామంలో దీనమ్మ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ నందు కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కొండమోడు సెంటర్లో వైయస్ఆర్ విగ్రహం వద్ద కార్యకర్తలు ఏర్పాటు చేసిన జన్మదిన కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం నకరికల్లు మండలం నకరికల్లు గ్రామంలో బంగ్లా సెంటర్ నందు కార్యకర్తలు ఏర్పాటుచేసిన జన్మదిన కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం ముప్పాళ్ళ మండలం పలుదేవర్లపాడు గ్రామంలో కార్యకర్తలు ఏర్పాటుచేసిన జన్మదినోత్సవ కేకును కట్ చేసి భార్గవ రెడ్డి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం సత్తెనపల్లి రూరల్ మండలం కొమెరపూడి గ్రామంలో కార్యకర్తలు ఏర్పాటుచేసిన జన్మదిన కేకును



కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టిన భార్గవ రెడ్డి, నాయకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తమ అభిమాన నాయకుడు పుట్టినరోజుని పురస్కరించుకొని నాయకులు, కార్యకర్తలు సుధీర్ భార్గవ రెడ్డిని దుశ్శాలువాలతో సత్కరించి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ,పట్టణ, మండల,గ్రామ,వార్డు పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు,మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం.. ఇద్దరు వార్డు కార్యదర్శులు సస్పెండ్




గుంటూరు అక్టోబర్ 12(స్పంద న్యూస్ ): ఆస్తిపన్ను సేవలను నిర్ణీత గడువులో పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉంచిన ఇద్దరు వార్డు అడ్మిన్ కార్యదర్శులను గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ సస్పెండ్ చేశారు. ఆటోనగర్–02 వార్డు సచివాలయానికి చెందిన డి. పద్మావతి 103 సేవలు, కొండవారివీధి–03 వార్డు సచివాలయానికి చెందిన కె. సుందర్ సింగ్ 58 సేవలను పెండింగ్‌లో ఉంచినట్లు గుర్తించారు. షోకాజ్ నోటీసులకు వారి వివరణలు సంతృప్తికరంగా లేకపోవడంతో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నారు. సస్పెన్షన్ సమయంలో గుంటూరు ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లకూడదని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

## ప్రయాణికులు మహిళలు ఇబ్బంది పడకుండా పంచాయతీ మరుగుదొడ్లను తెరిచి ఉంచాలి.



కొల్లూరు, అక్టోబర్ 12(స్పంద న్యూస్): కొల్లూరు బస్టాండ్ సెంటర్ లో ఉన్న పంచాయతీ కాంప్లెక్స్ ను మూసివేయడంతో ప్రయాణికులు, మహిళలు ఇబ్బంది పడుతున్నాం అంటున్నారు. నిత్యం తీసి ఉంచాల్సిన పంచాయితీ మరుగుదొడ్ల కాంప్లెక్స్ ను తీయకుండా ఉంచుతున్నారు. బస్సు ప్రయాణాలు చేసే మహిళలు కాలకృత్యాలు తీర్చుకోవాలంటే మూసివేయడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలు కూడా నానా అవస్థలు పడుతున్నామన్నారు. ఈ మరుగుదొడ్ల పైపులైన పగిలిపోవడంతో డ్రైనేజ్ లోనే నిలువ ఉండి దుర్వాసన వస్తుందని చుట్టుపక్కల షాపుల వారు వాపోతున్నారు. మరుగుదొడ్ల దగ్గర పెట్టిన వారు సరిగ్గా ఉండకపోవటం, అక్కడే మద్యం సేవించడంతో మరుగుదొడ్లకు వచ్చే మహిళలు వెళ్లలేకపోతున్నామని వాపోతున్నారు. ఇంత జరుగుతున్న పంచాయతీ అధికారులు మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉంటున్నారని మహిళలు ప్రయాణికులు అంటున్నారు. పైపులైన్ పగిలిన చోట బాగు చేయించడం కూడా చేయటం లేదని అలాగే బ్లీచింగ్ చల్లడం గానీ ఇలాంటి పనులు చేయకుండా వదిలివేశారని అంటున్నారు. ఈ సమస్యలను ఆధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు తలెత్తుతున్నాయి.

# సత్తెనపల్లి పలు అభివృద్ధి కార్యక్రమాలలో కన్నా





సత్తెనపల్లి,అక్టోబర్ 12 (స్పంద): సత్తెనపల్లి పట్టణంలోని హైబ్రిడ్ యాన్యూటీ మోడల్ (హ్యామ్)లో భాగంగా పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు,శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్లు,డ్రైనేజీలు, నిర్మాణ పనులకు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక సత్తెనపల్లి పట్టణ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని,గత 5 ఏళ్లలో నిలిచిపోయిన అభివృద్ధిని తిరిగి పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం సత్తెనపల్లిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, రోడ్లు వేయలేదని, డ్రైనేజీలు లేవని,ఇప్పుడు మన కూటమి ప్రభుత్వంలో ప్రతి వార్డుకు నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.ఇది కేవలం శంకుస్థాపన మాత్రమే కాదని,సత్తెనపల్లి అభివృద్ధికి నాంది అని, త్వరలోనే అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలియజేశారు.సత్తెనపల్లి పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు,డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని,సత్తెనపల్లి అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో వున్న ప్రభుత్వ అధికారులు,కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

### నాగలింగేశ్వర స్వామి వారి దేవాలయంలో

## గాయత్రి అలంకరణలో అమ్మవారు



పెదనందిపాడు అక్టోబర్ 12 (స్పంద న్యూస్) జిల్లాలో ప్రసిద్ధి చెందిన నాగులపాడు లో శ్రీ శృంగేరి శారదా పీఠ పాలిత శ్రీ వల్లి దేవసేన సమేత స్వయంభు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవాలయముల సముదాయం (పుట్ట)లో గల శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా రెండవ రోజు సోమవారం కమిటీ వారి నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు పి త్రినాధ శర్మ అమ్మవారికి గాయత్రి అలంకరణ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో అమ్మవారిని సందర్శించుకున్నారు. వాళ్ళు భజన సంఘాల వారిచే భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

## జనసేన నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి - అనురాధ.



కొల్లూరు, అక్టోబర్ 12 (స్పంద న్యూస్): స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ ఆత్మీయ సమావేశం ను నిర్వహించినట్లు జనసేన బాపట్ల పార్లమెంట్ సమన్వయకర్త సోమరౌతు అనురాధ తెలిపారు. సోమవారం పెసర్లంకలోని జనసేన పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త గళ్ళ తిరుపతి వెంకయ్య నివాసంలో అనురాధ మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించి ఆ వివరాలను పార్లమెంట్ కోఆర్డినేషన్ కమిటీకి అందించాలన్నారు. వేమూరు నియోజకవర్గ సమన్వయకర్తలు వూసా రాజేష్, బచ్చు పవన్ కుమార్, బొందలపాటి చలమయ్య, వెలువల ధర్మేంద్ర, టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారుల సమస్యలను గడువులోగా పరిష్కరించాలి

### అధికారులకు కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ ఆదేశం




గుంటూరు, అక్టోబర్ 12 (స్పంద న్యూస్ ): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డ్వామా పీడీ శంకర్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలపై పారదర్శకంగా విచారణ జరిపి, అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారాలు చూపాలన్నారు. పరిష్కారం సాధ్యంకాని సమస్యల విషయంలో స్పష్టమైన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.

కర్లపాలెం అక్టోబర్ 12 స్పంద న్యూస్ కర్లపాలెం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో సుమారు రూ. 50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ సెంటర్ (బి పి హెచ్ యూ) భవనాన్ని సోమవారం శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డి ఎమ్ అండ్ హెచ్ ఓ విజయమ్మ, వైద్యులు,గోపినాథ్, రామకృష్ణ, తహసీల్దార్ రవీంద్ర బాబు,ఎంపీడీఓ శ్రీనివాసరావు,మండల అధ్యక్షులు బాజి,నాయకులు నక్కల వెంకట స్వామి,ముసలయ్య,వేణు గోపాల్ రెడ్డి,వసంత్ రెడ్డి,మాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలి

**సమస్యాత్మక గ్రామాలు, వార్డులను గుర్తించాలి: కలెక్టర్ సాయికాంత్ వర్మ**

గుంటూరు, అక్టోబర్ 12 (స్పంద న్యూస్ ): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఎన్నికల సన్నద్ధతపై వీడియో సమావేశం నిర్వహించారు.సమస్యాత్మక గ్రామాలు, వార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించి మంగళవారం నాటికి వివరాలు సమర్పించాలని సూచించారు. సాధారణ, సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాలను మరోసారి పరిశీలించి, శాంతిభద్రతల పరిరక్షణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, ప్రచార అనుమతుల కోసం ఏకగవాక్ష విధానం అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ గత అనుభవాలు, క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని, బైండోవర్ కేసులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన ప్రాంతాల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

